దార్లన్నీ అధ్వానం.. ప్రయాణం నరకప్రాయం!


సుండుపల్లె మార్గంలోని అనుంపల్లె వద్ద ప్రయాణించలేని స్థితిలో రోడ్డు


శిబ్యాల దళితవాడ ఎదురుగా మడుగును తలపిస్తున్న రహదారి


అనుంపల్లె రోడ్డులో ఇరుకైన రోడ్డుపై రోడ్డు గతుకులుగా మారడంతో ప్రమాదకరంగా ప్రయాణం

రాయచోటి టౌన్ : 2024లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం ఆధ్వర్యంలో రోడ్ల స్థితిపై నానాయాగీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు మరిచిందని, ప్రయాణికులు ఆపసోపాలు గురవుతున్నారని వారు చేసిన తతంగం అంతా ఇంతా కాదు. వారికి తోడు ఆ పార్టీకి భాకాలూదే పత్రికలు, చానళ్లు సైతం చేసిన విషప్రచారం మామూలుగా చేయలేదనే చెప్పాలి. తీరా 2024లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని కూటమి పార్టీలు గెలిచి ఏడాదిన్నర అయ్యినప్పటికీ ఏ ఒక్క రోడ్డును బాగు చేసిన దాఖలాలు లేవు. అలానే గతంలో రోడ్ల మరమ్మతులకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని, రోడ్ల పరిస్థితిని బాగు చేస్తామని ప్రగల్భాలు పలికారు. కానీ క్షేత్రస్థాయిలో ఏ ఒక్క రోడ్డు దుస్థితి బాగుపడింది లేదు. ముఖ్యంగా రాయచోటి – సుండుపల్లె రోడ్డులో శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి సుండుపల్లె వరకు సుమారు 22 చోట్ల రోడ్డు గోతులు తేలాయి. రాయచోటి – రాజంపేట రోడ్డులో అయితే రహదారి పరిస్థితి అధ్వానం కంటే దారుణంగా ఉందనే చెప్పాలేమో. బాలరాచపల్లె నుంచి ఇసుక ట్రక్కులు నిత్యం పదుల సంఖ్యలో వెళుతుండటంతో ఈ మార్గంలో చాలా చోట్ల గోతులు ఏర్పడ్డాయి. రాయచోటి నుంచి రాజంపేటకు వెళ్లేందుకు రెండు గంటల సమయం పడితే రాయచోటి నుంచి సానిపాయి (18 కిలోమీటర్ల దూరం)కి వెళ్లేందుకు గంట కంటే ఎక్కువ సమయం పడుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. సుండుపల్లె రోడ్డులో శిబ్యాల అరుంధతివాడ దగ్గర, శిబ్యాల వంక బిడ్జి, చెరువు క్రాస్, అనుంపల్లె అటవీ వద్ద, అనుంపల్లె గ్రామం, విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఇలా కిలోమీటర్‌కు రెండు మూడు చోట్ల ఎక్కడ చూసినా గతుకుల రోడ్లే తారసపడతాయి. అలానే రాజంపేట రోడ్డులోని సీతంపేట కొత్తపల్లె నుంచి జంగంపల్లె వరకు దారుణస్థితికి చేరుకున్న రోడ్డు పరిస్థితి కళ్లకు కనిపించకపోదు. ఆయా మార్గాల్లోని గోతులలో చిన్నపాటి వానలకే మడుగులను తలపిస్తుంటాయి. ఎవరైనా కొత్తవారు ఆ దారిలో వెళితే ప్రమాదాన్ని కొని తెచ్చుకొనక తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాస్థాయి అధికారులు, ఆర్ అండ్ బీ అధికారులు రోడ్ల దుస్థితిపై దృష్టి సారించి నూతన రోడ్డు వేయించాలని, మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, ఆయా గ్రామాల వాసులు విన్నవిస్తున్నారు.


రాయచోటి - రాజంపేట రోడ్డులోని సీతంపేట వద్ద అధ్వానంగా ప్రధాన రహదారి


సీతంపేట కొత్తపల్లె వద్ద రోడ్డు దుస్థితి


అనుంపల్లె అటవీ ప్రాంతంలో గుంతలమయంగా రహదారి


సుండుపల్లె మార్గం శిబ్యాల వద్ద ఇరుకైన బ్రిడ్జిపై వెళుతున్న ట్రాక్టర్

అడుగుకో గుంత.. అడుగెయ్యాలంటే చింత


కేంద్రీయ విద్యాలయం వెళ్లే మార్గంలో కంకరతేలిన సిమెంటు రోడ్డు

రాజంపేట టౌన్ : రాజంపేట పార్లమెంట్, రెవెన్యూ డివిజనల్ కేంద్రం. అయినప్పటికీ పట్టణంలోని ప్రధానమైన మార్గాల్లోనూ రోడ్లు అధ్వానంగా ఉన్నా కూటమి ప్రభుత్వం పట్టించుకుంటున్న పాపానపోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలావుంటే పట్టణంలోని వత్తలూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే మార్గంలోని రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడి ఆ మార్గంలో వెళ్లేందుకు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. ఈ మార్గం ద్వారానే దాదాపు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాల్సివుంది. రోడ్డు అధ్వానంగా ఉండటంతో వాహనదారులు, పాదచారులకు అగచాట్లు తప్పడం లేదు. ఇదిలావుంటే పట్టణంలోని 12వ వార్డులో ఉన్న సరస్వతీపురంలోని రోడ్లు దారుణంగా ఉన్నాయి. కేంద్రీయ విద్యాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న వాటర్ ఫిల్టర్ ప్రాంతంలో సిమెంటు రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాళ్లు బయటకు వచ్చాయి. ఆ మార్గంలో కూడా గుంతలు పడివుంటడటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ద్విచక్రవాహనాల్లో పాఠశాలకు తీసుకెళ్లే సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదిలావుంటే చిన్నపాటి వర్షం కురిసినా ఆ ప్రాంతంలోని రోడ్లల్లో నీళ్లు నిలిచివుంటుండటంతో పాదచారులు వర్షపు నీటిలోనే నడవాల్సి వస్తుంది. అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గోతులమయంగా రోడ్డు

క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


ప్రతిష్ట పూజలు అందుకున్న గంగమ్మ

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలోని కడప – చెన్నై జాతీయ రహదారి వద్ద ఆదివారం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు వేదపండితులచే పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిపించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆదివారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆదివారం కావడంతో ఆలయంలో భక్తుల తాకిడి కనిపించింది. ముందుగా ఆలయాన్ని శుభ్రం చేసి అలంకరించిన ఆలయ కమిటీ సభ్యులు అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేయించి విశేషంగా అలంకరించారు. అనంతరం వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి, పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అలానే అమ్మవారి ఆలయంలో ఉన్న బీజాక్షరాలతో ఉన్న మహిమ గల రాయికి పొర్లుదండాలు పెట్టారు. వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. బలులర్పించిన భక్తులు ఆలయ పరిసరాల్లో వండుకొని బంధు, మిత్రులతో కలసి విందును ఆరగించారు.

పూజలందుకున్న ఇరుగులమ్మ



సిద్దవటం : మండలంలోని సిద్దవటం గ్రామ శివారులోని మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద పెన్నానది ఒడ్డున వెలసిన శ్రీ ఇరుగులమ్మకు ఆదివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారని ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థ ప్రసాదాలు పొందారని చెప్పారు.

నామకరణ వేడుకలో మాజీ ఎమ్మెల్యే


కార్యక్రమంలో పాల్గొన్న మోహన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి మండలం దిన్నెపాడు గ్రామం నరసింహరాజుగారిపల్లికి చెందిన నరసరాజు మనువరాలు పేర్నిక నామకరణం వేడుకలలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ నామకరణ వేడుకలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, గజేంద్రారెడ్డి, శంకర్ రెడ్డి, రాజేంద్రారెడ్డి, ధర్మరాజు, సుబ్బరామరాజు, రఫీ, బాబయ్య, చిన్నబాషా తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్మికులను తొలగించడం తగదు


మాట్లాడుతున్న కేసీ బాదుల్లా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగరపాలక సంస్థ పరిధిలో చెత్తపన్ను వసూళ్లలో జరిగిన అవకతవకల్లో అప్కాస్ చిరు కార్మికులను తొలగించి, పర్మినెంట్ కార్మికులను సస్పెండ్ చేయడం తగదని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా పేర్కొన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం చట్ట విరుద్ధమన్నారు. సంస్థ పరిధిలో పది నెలల కాలంలో కమర్షియల్ షాపుల నుంచి వసూలు చేసిన చెత్త పన్ను వసూళ్లపై మాత్రమే విచారణ జరిపించి కార్మికులు, ఉద్యోగులను బలిపశువులు చేయకుండా.. గత ప్రభుత్వంలో క్లాప్ మిత్ర ఇంటింటికి చెత్త పన్ను వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అవకతవకల్లో జరిగిన సొమ్ము కార్మికులు, ఉద్యోగుల నుంచి రికవరీ చేసి తొలగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయడంతోపాటు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు


వాల్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

రాజంపేట రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఇ.సికిందర్‌లు మండిపడ్డారు. స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం వద్ద ఆదివారం సీపీఐ మహాసభల వాల్ పోస్టర్‌లను భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంగోలులో ఆగస్టు 23వ తేదీ నిర్వహించే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వసతులు కల్పించటంలో విఫలమైన ఈ ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగడదామన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలో ఆత్మసంతృప్తి


కూలీలకు ఆహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట : పేదలకు సేవ చేయడంలో ఆత్మసంతృప్తి ఉందని రాజంపేట శాసనసభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. ఆదివారం తన ఎస్టేట్‌లో వలస కూలీలకు ఎమ్మెల్యే స్వయంగా ఆహారం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనోపాధి కోసం తన ప్రాంతాలను వదలి దూరంగా వచ్చి కూలీనాలీ చేసుకునే వారికి కడుపునిండా అన్నం పెడితే అది పూర్వజన్మసుకృతంగా భావిస్తానన్నారు. ఆకలితో ఉన్న వారికి ఆకలి తీర్చడం దేవుడి కల్పించిన మహాభాగ్యమన్నారు. దేవదేవుని ఆశీస్సులతో పేదల ఆకలితీర్చే అవకాశాలు నాకు కలిగియన్నారు. అన్నదానం అన్ని దానాల్లో కన్న మహాగొప్పదన్నారు. తన ఎస్టేట్‌లో పేదలకు నిరంతరం ఏదో విధంగా సేవలందిస్తుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం


యాచకులకు అల్పాహారం అందజేస్తున్న జర్నలిస్టులు

రాజంపేట టౌన్ : జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యమని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బచోటి భాస్కర్ తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని పేదలు, యాచకులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతి యేటా సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందులో భాగంగానే ఒకపూట అయినా పేదల ఆకలిని తీర్చే ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీయూడబ్ల్యూజే రాజీలేని పోరాటం సాగిస్తుందన్నారు. తమ యూనియన్ పోరాటాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో అత్యధిక మంది జర్నలిస్టులు ఉన్న యూనియన్ కూడా తమదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ మలిశెట్టి సుబ్బనరసింహులు, నాయకులు ఉదయగిరి కల్యాణ్, మండ్ల శ్రీహరి, చామంచి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో తుంపర




పెనగలూరు : గత కొన్నిరోజులుగా పలు ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు నిండుతున్నా పెనగలూరు మండలంలో మాత్రం వరుణుడు తుంపరతో సరిపెట్టుకుంటున్నాడు. రెండు రోజుల నుంచి వర్షం కురిసినా పదును కూడా కురవకపోవడం గమనార్హం. శుక్రవారం నుంచి శనివారం వరకు 2.2 మిల్లీ మీటర్లు, ఆదివారం 6.8 మిల్లీ మీటర్లు మాత్రమే వర్షపాతం నమోదైంది. మండలంలో వర్షాభావ పరిస్థితులు కారణంగా ఆరుతడి పంటలను రైతులు సాగు చేశారు. వాగులు, వంకలు, చెరువులలో పశువులు తాగేందుకు ఇప్పటి వరకు నీళ్లు లేవంటే మండల పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. అనేక గ్రామాల్లోని బోరుబావుల్లో నీరు అడుగంటి పోయాయి. ఇప్పటికే మామిడి, నిమ్మతోటలు నీరు లేక ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్‌గా షేక్ మహమ్మద్


మహమ్మద్‌కు పిన్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాయచోటి టౌన్ : రాయచోటి లయన్స్ క్లబ్ మాజీ చైర్మన్ షేక్ మహమ్మద్‌ను రీజనల్ చైర్మన్‌గా ఎన్నుకున్నట్లుగా రాయచోటి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పసుపులేటి శ్యామ్ తెలిపారు. ఆదివారం గుంతకల్‌లో నిర్వహించిన 8వ క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో మహమ్మద్‌ను రీజనల్ చైర్మన్‌గా ఇంటర్నేషనల్ వైస్ చైర్మన్ లయన్ విజయరామరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారని తెలిపారు. ఆయనకు అనంతరం క్లబ్ పెద్దలు సురేష్ బాబు చేతుల మీదుగా పిన్ ఇచ్చారని పేర్కొన్నారు.

ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు


వాహనాల తనిఖీ చేస్తున్న సీఐ బాబు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం పరిధి మూలపల్లె క్రాస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనాలను తనిఖీ చేపట్టామని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్, వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని ద్విచక్ర వాహనదారులను తనిఖీలు చేసి 10 ద్విచక్ర వాహనదారులపై కేసుల నమోదు చేశామన్నారు. వారికి ఒక్కొక్కరికి రూ.185 చొప్పున జరిమానా విధించామని ఆయన అన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడిపిన ముగ్గురిపై డ్రక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని సీఐ తెలియజేశారు.

ఒకే ఈతలో రెండు దూడలు

రామసముద్రం : పాడి ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. రామసముద్రం మండలం కెసి.పల్లి పంచాయతీ గుంతయంబాడి గ్రామానికి చెందిన కృష్ణయ్యగారి మంజునాథరావు డైరీఫామ్‌లో హెచ్‌ఎఫ్ పాడి ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. అందులో ఒకటి పాయ, ఒకటి కోడె దూడ కావడంతో రెండూ సురక్షితంగా ఉన్నాయి. ఆవు నుంచి పాలు పితకకుండా మొత్తం పాలను దూడలకు వదిలేస్తున్నారు.

ఇసుక తొలగించి ప్రమాదాలను నివారించండి


పీహెచ్‌సీ వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా ఇసుక

వీరబల్లి : మండలంలోని మాండవ్య నది నుంచి రాత్రింబవళ్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్లు అధిక లోడు వేసుకొని రవాణా చేస్తున్నప్పుడు పంచర్లు కావడం, ట్రాక్టర్లు చెడిపోవడంతో ఇసుకను రోడ్లపైనే వదిలేసి వెళ్తున్నారు. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు నడిపే డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. వీరబల్లి నుంచి రాయచోటికి అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. మార్గమధ్యలో ఇసుక రోడ్డుపై అడ్డంగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే రోడ్డుపై అడ్డంగా ఇసుక ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిపోతున్న విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమంగా ఇసుకను తరలించే వారిపై, ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ముత్తు మారెమ్మకు అంబళ్లు సమర్పణ


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆకేపాటి, నాయకులు


అలంకరణలో ముత్తుమారెమ్మ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఆదివారం ముత్తు మారెమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి అంబళ్లను సమర్పించారు. ఆలయ ధర్మకర్త స్వామి ఏలుమలై ఆహ్వానం మేరకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ముత్తు మారెమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆకేపాటిని పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఆయన వెంట వైస్ ఎంపీపీ నాయనపల్లి అనుదీప్, వైఎస్‌ఆర్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, యువనాయకుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, చొప్ప నరసింహారెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, బూసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నూకా నాగేశ్వరరెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, విజయుడు, పాదిలి దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు


ప్రశంసాపత్రాలను అందుకున్న రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది


రవీంద్రనాయక్, ఎంఈఓ


జయసూర్య నాయక్

సుండుపల్లె : విధి నిర్వహణలో విశిష్ట సేవలకు గుర్తింపుగా మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాయక్, పంచాయతీరాజ్ ఏఈ జయసూర్య నాయక్‌లు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అలానే రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఈఓ వీరనారాయణ, సీహెచ్‌ఓలు జ్యోష్న, సాల్మన్‌లు రోగులకు అందించిన సేవలకు గాను జిల్లా డీఎంహెచ్‌ఓ లక్ష్మీనరసయ్య చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ పురస్కారం తమ బాధ్యత మరింత పెంచిందని అవార్డు గ్రహీతలు తెలియజేశారు.

విలియం కేరి జీవితం ఆదర్శనీయం

కడప రూరల్ : విలియం కేరి జీవితం ఆదర్శనీయమని బిషప్ కె.సామేలు బాబు అన్నారు. ఆదివారం ఎలిమ్ ప్రార్థన మందిరంలో విలియం కేరి జయంతి వేడుకలు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన జీవిత విశేషాల పైన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం బిషప్ మాట్లాడుతూ విలియం కేరి భారతదేశానికి మిషనరీగా వచ్చి, వెలకట్టలేని సేవలను అందించారని కొనియాడారు. ఈయన మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చారని పేర్కొన్నారు. విజయ భాస్కర్ మాట్లాడుతూ విలియం కేరి అటవీ పరిరక్షణపై రచనలు చేసిన మొదటి వ్యక్తి అని తెలిపారు.